పగలు రెక్కీ.. రాత్రి చోరీ!



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని సొసైటీ కార్యాలయంలో పగలగొట్టిన తలుపు



చోరీ చేయడానికి వాడిన ఐరన్ స్పానర్

కాలనీల్లో దొంగల హల్‌చల్

- బైక్‌లు, విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్న వైనం
- భయాందోళనలో కాలనీల ప్రజలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో దొంగల ముఠా హల్‌చల్ చేస్తోంది. ఆల్విన్‌కాలనీ డివిజన్, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్ల పరిధిలో నిత్యం చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చీకటి పడితే చాలు దొంగలకు ఈ ప్రాంతాలు అడ్డాగా మారాయి. పగలు రెక్కీ చేసి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతూ కంటి కింద కినుకు లేకుండా చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో ఇటీవల జరిగిన చోరీలు ఇవే..

ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో...
ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని సొసైటీ కార్యాలయంలో సోమవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఐరన్ స్పానర్‌తో తాళం పగులగొట్టి లోపల ఉన్న గ్లాస్ డోర్‌ను సైతం పగలగొట్టి ఆఫీస్‌లోని టీవీ, ఇతర వస్తువులను దొంగతనం చేయటానికి ప్రయత్నించాడు. స్థానికులు పట్టుకొని జగద్గిరిగుట్ట పోలీసులకు అప్పగించారు.

ధరణినగర్‌లో...
ధరణినగర్‌లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు అందినకాడికి దోచుకెళుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, టైర్లు, నూతనంగా నిర్మించే ఇళ్ల ముందు ఉన్న పెయింటింగ్ డబ్బాలు, పాల ప్యాకెట్లు, విలువైన వస్తు సామగ్రిని సైతం ఎత్తుకెళ్తున్నారని సంక్షేమ సంఘం సభ్యులు చెబుతున్నారు.

తులసీనగర్‌లో...
ఆల్విన్‌కాలనీ తులసీనగర్, శ్రీతులసీనగర్, భూదేవిహిల్స్‌లలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న వస్తువులను ఎత్తుకెళ్తున్నారు. ఆరుబయట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

పాపిరెడ్డినగర్‌లో...
కొద్ది రోజుల క్రితం పాపిరెడ్డినగర్‌లో వీధుల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి దొంగతనానికి పాల్పడుతున్నారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

వివేకానందనగర్ కాలనీలో...
కూకట్‌పల్లి, వివేకానందనగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ పార్కు ముందు వీధిలో పార్కింగ్ చేసిన టూ వీలర్ యాక్టివా బైక్‌ను దొంగిలించారు. సొంత వాహనాలపై కూర్చొని ఎవరికి కంట పడకుండా చాకచక్యంగా వాహనాల తాళాలు తీసి తస్కరిస్తున్నారు. ఇలా పలు కాలనీల్లో ఇళ్లల్లో చొరబడి విలువైన కరెంటు పరికరాలు, నల్లాలు, లైట్లు, ఇత్తడి సామాన్లు, నిర్మాణ సామగ్రి వంటివి కూడా దొంగతనాలు చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు కాలనీల్లో గస్తీ ఏర్పాటు చేసి ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కాలనీల్లో పెట్రోలింగ్ చేసి దొంగతనాలు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పాపిరెడ్డినగర్, వివేకానందనగర్‌లో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు(సీసీఫుటేజీ)



ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లో దొంగను పట్టుకుని స్తంభానికి కట్టేసిన స్థానికులు

కాలనీల్లో నిఘా పెంచాలి



కాలనీ, బస్తీల్లో పోలీసులు నిఘా పెంచాలి. కాలనీల సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి దొంగల బెడదను అరికట్టే విధంగా ప్రణాళిక ఏర్పాటు చేయాలి. దొంగల కారణంగా ప్రజల ఆస్తి, ఆస్తి నష్టం జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.
– కట్టా శ్రీనివాసరావు, ఆల్విన్‌కాలనీ



24 గంటలు వైద్యం అందించే ఆసుపత్రులు

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో..

మెడికేర్ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ :	88852 62138
శ్రీకర హాస్పిటల్ :	04047470000
ప్రణామ్ ఆస్పత్రి :	040 2304 2777
హీలెక్స్ ఆసుపత్రి :	040 42007070
లక్ష్మి చిల్డ్రన్ ఆసుపత్రి :	040 2303 9733
అంకుర చిల్డ్రన్ ఆసుపత్రి :	040 4939 9999
ఉద్భవ ఆసుపత్రి :	040 6782 0172
సిదార్థ ఆసుపత్రి :	79933 33301
పల్స్ సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి :	040 29334142

సీఆర్ ఫౌండేషన్‌లో శిక్షణా కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఉచితంగా ఇస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు 3 నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మహిళలు, చిన్నారులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ జోస్యభట్ల కల్పన ఫోన్: 9603193925 కు సంప్రదించవచ్చు.

ప్రభుత్వ మోడల్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్స్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఈనెల 22వ తేదీన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన ఉదయం10.30 గంటలకు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్‌లు తీసుకుంటున్నామన్నారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ టీసీ, 10వ తరగతి హాల్ టిక్కెట్ కాపీలు, 10వతరగతి ఫలితాల షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించిన వెంటనే అడ్మిషన్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పత్రాల సమర్పణకు గ్రేస్ సమయం ఉండదని తెలిపారు.

ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

రాయదుర్గం: మధురానగర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెద్దగోని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, బీఆర్ఎస్ నాయకులు సాయిబాబా,గణేష్, శ్రీనివాస్‌యాదవ్‌లను ఘనంగా సత్కరించారు. దారుగుపల్లి నరేష్, నారాయణ, గోవింద్, స్థానికులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సమావేశం

గచ్చిబౌలి: మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మసీద్‌బండలో బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కన్వీనర్ రాఘవేంద్రరావు, ఇంచార్జీ ఎం.రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రధాన నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు హైదరాబాద్‌కు వస్తున్నారని వారికి ఘన స్వాగతం పలకాలన్నారు. డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. పార్టీ సీనియర్ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మణిభూషణ్, రామరాజు, నవతా రెడ్డి, వెలగ శ్రీనివాస్, శ్రీధర్, ఆంజనేయులు, నవీన్‌గౌడ్, కృష్ణ ముదిరాజ్, రాజుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ అధికారులతో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. వర్షాకాలం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. డ్రైనేజీ వ్యర్థాలను వెంటనే తొలగించాలని, విద్యుత్ దీపాలు, గుంతల రోడ్లు, కుంగిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. వానా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణకు మందు స్ప్రే చేయాలని సూచించారు. అదే విధంగా డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ కృష్ణయ్య, ఎస్‌డబ్ల్యూఎం మోహన్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మమత, వాటర్ వర్క్స్ డీజీ వెంకటేశ్వరరావు, స్ట్రీట్ లైట్ భద్రన్న, హార్టికల్చర్ డిపార్టుమెంట్ ప్రియాంక, ఎంటమాలజీ డిపార్టుమెంట్ ఉషారాణి, ఎస్ఎఫ్ఐ, ఎస్ఆర్‌పీలు, వివిధ కాలనీ అసోసియేషన్ల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపింది. అన్ని శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొనాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది.

రేపు మాధవరం సుదర్శన్‌రావు జయంతి

కూకట్‌పల్లి: కార్మిక, కర్షకుల పక్షపాతి అయిన మాధవరం సుదర్శన్‌రావు జయంతిని ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో ఉదయం 11.30 గంటలకు జయంతి వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుదని తెలిపారు.

23న వివాహ పరిచయ వేదిక

మూసాపేట: బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 23న జరిగే వివాహ పరిచయ వేదిక ఉంటుందని అధ్యక్షులు వెల్లాల రామ్మోహన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్యకు సన్మానం

కూకట్‌పల్లి: చిందు యక్షగానం కళాకారుడు, పద్మశ్రీ గ్రహీత గడ్డం సమ్మయ్యను జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్ శాలువాతో సన్మానించారు. 19వేల ప్రదర్శనల్లో గొప్ప కళారూపాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఆయన చేసిన సేవకు భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రటించిందని తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం సమ్మయ్యను శాలువాతో సత్కరించారు.

కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తా

బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నేత రవిసింగ్



మృతిడి భార్య గీతాంజలికి చెక్కు అందజేస్తున్న రవిసింగ్

మూసాపేట: కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి న్యాయం జరిగేలా చూస్తానని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ కలకల్‌లో ఉన్న మహాలక్ష్మీ లిమిటెడ్ కంపెనీలో ఒరిస్సా బలాసూర్‌కు చెందిన అజయ్‌కుమార్ రావత్ ప్రమాదవశాత్తు మృతిచెందారు. కంపెనీ యాజమాన్యం పూర్తి స్థాయిలో స్పందించకపోవటంతో వారి కుటుంబ సభ్యులు రవిసింగ్‌ను సంప్రదించారు. దీంతో ఆయన స్పందించి యాజమాన్యంతో మాట్లాడి రూ.7.5లక్షలు వచ్చేలా చూశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో కార్మికుడి భార్య గీతాంజలికి కుటుంబ సభ్యులు సిద్దేశ్వర్ సమక్షంలో సదరు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, జగన్, సుదర్శన్, కిరణ్ పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలి



పెద్దపల్లి జిల్లాలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాలానగర్: మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండా పోతోందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఫాస్ట్ ట్రాక్ చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్య రెడ్డి, ఐద్వా మండల కార్యదర్శి వి. కరుణ డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలో 6 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేండిల్ ర్యాలీ నిర్వహించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలో తల్లితో పాటు నిద్రిస్తున్న

ప్రజా సంఘాల డిమాండ్

ఆరేళ్ల బాలికను రైస్ మిల్ డ్రైవర్ బలరాం ఎత్తుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. ఆ మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, చట్టాలపై భయం ఉంటేనే వేధింపులకు కళ్లెం వేయగలమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఐద్వా మండల అధ్యక్షురాడు భాగ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు పి. శంకర్, సతీష్, అనిత, మౌనిక, కవిత, దీప్తి, రాజు, మల్లేష్, మాధవి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఘనాపూర్ గ్రామంలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఎల్లమ్మ తల్లి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని మంజీరా క్యాంపస్‌లోని స్వయంభు పెద్దమ్మ తల్లి దేవస్థానం ఏడవ వార్షికోత్సవం నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం , హోమాలు చేశారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాయదుర్గం: శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో సుమధుర అపార్ట్‌మెంట్స్‌లో నెలకొన్న సమస్యలపై అపార్ట్‌మెంట్‌వాసులు, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమధుర అపార్ట్‌మెంట్స్ వాసులు మాట్లాడుతూ రోజుకి 18 సార్లు కరెంటు పోతోందని, లో ఓల్టేజీ అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ చరణ్, ఏఈ వేణుగోపాల్, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, నరేష్, నారాయణ, గోవింద్, రామిరెడ్డి, సుమధుర అపార్ట్‌మెంట్స్ చైర్మన్ పివిచౌదరి, రామారావు, దేవిరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రదీప్‌కుమార్, ఎంఎస్‌రావు, రాంనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి పాములు

పట్టుకున్న ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ



కాముని చెరువులో పెరిగిపోయిన గుర్రపుడెక్క,



శ్రీనిధి అపార్టుమెంట్‌లోకి వచ్చిన పాము

కూకట్‌పల్లి: కైత్లాపూర్ శ్రీరామ్‌కాలనీలో శ్రీనిధి అపార్టుమెంట్ వద్ద సుమారు 5 అడుగుల త్రాచుపామును మంగళవారం సాయంత్రం ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీకి చెందిన శంకర్ పట్టుకున్నారు.

అపార్టుమెంట్ వాసి కిరణ్ ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే శంకర్ వచ్చి ఆర గంట సేపు శ్రమించి పామును పట్టుకున్నారు. ఈమధ్య అపార్టుమెంట్‌ని ఆనుకొని ఉన్న దిగరుడ రెసిడెన్సీలోకి రెండు పాములు ప్రవేశించాయని కిరణ్ తెలిపారు. కాలనీ వెనుక, ముందు ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. కాలనీ వెనుక ఉన్న కాముని చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిపోవటంతో దోమలు, పాములు కాలనీలోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. చెరువులోని గుర్రపుడెక్కను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో వార్షిక బ్రహ్మోత్సవ పూజలు

మోతీనగర్: ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియమ నిష్టలతో స్వామివారిని పూజిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని ఆలయ చైర్మన్ వీఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. ఈ పూజల్లో కార్యనిర్వాహణ అధికారి జీఏకే కృష్ణ, కమిటీ సభ్యులు డి. రేవతి, సత్యనారాయణ, ఆర్. సత్యనారాయణస్వామి, బి. సుశీల్‌కుమార్ యాదవ్, డి.రాము, అనిల్‌కుమార్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



కలశ పూజలో పాల్గొన్న భక్తులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని న్యూ గౌతమ్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యపై స్థానికులు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం జలమండలి మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి ఆయన గౌతమ్‌నగర్‌లో పర్యటించారు. డ్రైనేజీ పైపులైన్ సరిగా లేదని... టర్నింగ్‌లో యూ షేప్ లైన్ వేసి సమస్యను పరిష్కరించాలన్నారు. మూడు రోజుల్లో పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని జలమండలి అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, సురేష్ గౌడ్, గోపాల్, సురేందర్ నాయుడు, వీరేశం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



న్యూ గౌతమ్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్, నేతలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 5వ ఫేజు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తితో మహిళలు రాజకీయాల్లోకి రావాలన్నారు.

ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదకరం



కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ప్రత్యేక డ్రైవ్‌లో ఆర్టీసీ అధికారులు

మూసాపేట: ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రమాదం అని, ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేయకూడదని డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత అన్నారు.

మంగళవారం కూకట్‌పల్లిలో ఆయా బస్టాప్‌ల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక టీమ్‌లు ఆయా బస్టాండ్‌లలో ఉండి జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. బస్‌లు బస్‌బేలోకి వచ్చే విధంగా చూడటం, ప్రయాణికులు బస్ ఆగిన తరువాత బస్ ఎక్కటం, దిగటం చేయాలని సూచిస్తూ, ఆ సమయంలో డ్రైవర్, కండక్టర్‌ల ప్రవర్తనను పర్యవేక్షిస్తారని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయని విద్యార్థులు పరుగెత్తుకుంటూ వెళ్లి బస్ ఎక్కవద్దని సూచించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ ఇషాక్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శేరిలింగంపల్లి: పట్టాలు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగిపోయి మృతి చెందిన సంఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ భాగ్యరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో పట్టాలు దాటుతున్న వ్యక్తి (40)ని రైలు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడన్నారు. మృతుడు 4.6 అడుగుల ఎత్తు, బ్లూ కలర్ ప్యాంట్, ఎరుపు,తెలుపు గీతల షర్ట్ ధరించినట్లు తెలిపారు. నాంపల్లి జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలకు చెందిన వై.నరేందర్ రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామగ్రామాన బీజేపీ శక్తివంతంగా తయారైందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శిగా నియమితులైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.